నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 15 మార్చి 2025 | VIKARABAD



# ఆనందాల హరివిల్లు



రంగుల ఉత్సవం, ఆనందాల కేళి.. హోలీ పండుగ శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగింది. ఉదయం నుంచే చిన్నారులు, యువకులు, మహిళలు హోలీ సంబురాల్లో పాల్గొని ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుని ఉత్సాహంగా జరుపుకొన్నారు. గురువారం రాత్రి పలు కూడళ్లలో కామదహనాన్ని నిర్వహించారు. గ్రామాల్లో యువకులు డీజేలు, బ్యాండ్‌లను ఏర్పా టు చేసి డ్యాన్స్‌లు చేశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



## దాహం దాహం

ఎండలు మండిపోతుండటంతో జనం మధ్యాహ్నం వేళ .. బయటికి రావాలంటేనే జంకుతున్నారు. మరోవైపు మనుషులే కాదు.. ఎండవేడికి మూగజీవాలు కూడా అల్లాడిపోతున్నాయి. చిత్రంలో ఓ శునకం ఇలా నల్లా నీటిని తాగుతూ.. దాహార్తి తీర్చుకుంటున్నది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో కనిపించిందీ దృశ్యం.

# ప్రశ్నిస్తే.. సస్పెన్షనా..?

### ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే శాసనసభ సమావేశాల నుంచి వేటు వేస్తారా..?

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెండ్‌ను నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలో వెల్లువెత్తిన నిరసనలు
- ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు
- షాద్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- మొయినాబాద్‌లోని జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- దౌల్తాబాద్‌లో రేవంత్ దిష్టిబొమ్మ దహనం



షాద్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

వివరాలు IVలో..

శాసనసభ సమావేశాల నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజా సమస్యలపై గళమెత్తి, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే సస్పెండ్ చేస్తారా..? అని మండిపడ్డారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అక్రమ సస్పెన్షన్‌ను ఖండిస్తూ షాద్‌నగర్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు వారిని అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అదేవిధంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ జడ్పీటీసీ మహిపాల్ సారథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సమస్యలపై పోరాడుతున్న జగదీశ్‌రెడ్డిని శాసన సభ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు తదితరులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అదేవిధంగా రేవంత్ సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ విధించడాన్ని నిరసిస్తూ పరిగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజల పక్షాన ప్రశ్నిస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కుతారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అనైతికం, అప్రజాస్వామికమన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే ఓర్వలేక.. ఉద్దేశపూర్వకంగానే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేశారని మండిపడ్డారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



మొయినాబాద్‌లోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



ఇబ్రహీంపట్నం : రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



దౌల్తాబాద్ మండల కేంద్రంలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## పైపులైన్ పనులకు మరమ్మతులు

నమస్తే ఎఫెక్ట్

కేశంపేట, మార్చి 14 : మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామంలో వృథాగా పోతున్న మంచినీటి నివారణకు అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. 'నీరు వృథా అవుతున్నా పట్టించుకోరా..?' అనే శీర్షికతో ఈ నెల 14న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన వార్త కథనానికి మిషన్ భగీరథ ఏఈ నాగమణి స్పందించి మరమ్మతులు చేయించినట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల కిందట ఓ భారీ వాహనం మిషన్ భగీరథ పైపులైన్ పై నుంచి వెళ్లడంతో అది పగిలిపోయింది. పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేసి గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు నీటిని సరఫరా చేస్తామన్నారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మిషన్ భగీరథ నీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

## ఎన్ని రోజులు ఇబ్బందిపడాలి..?



నీటి సమస్య త్వరగా పరిష్కరించాలని ఇటీవల కారోబార్‌ను నిలదీసిన మూడు వార్డులకు చెందిన మహిళలు

- నీటి సమస్యను పరిష్కరించరా..?
- గ్రామ కారోబార్‌ను నిలదీసిన మహిళలు
- అయినాపూర్‌లోని మూడు వార్డుల్లో నీటికి కటకట

పరిగి, మార్చి 14 : మంచినీటి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో దోమ మండలం అయినాపూర్‌లోని మూడు వార్డులకు చెందిన మహిళలు ఇటీవల కారోబార్‌ను అడ్డుకుని నిలదీశారు. బోరులో మరిన్ని పైపులు దింపి నీటిని అందిస్తామన్నారు. ఇంకా ఎన్ని రోజులకు సమస్య పరిష్కారమవుతుందని మండిపడ్డారు. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తానని అతడు చెప్పగా.. రోజులు గడుస్తున్నాయి తప్ప నీటి సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఎండాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజు ల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. మండల స్థాయి అధికారులైనా స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

అయినాపూర్ గ్రామంలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదు. గ్రామంలోని బోర్లకు గల డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్‌తో నీటిని సరఫరా చేసేవారు. 1, 2, 3 వార్డులకు నీరు అందించే బోరులో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోవడంతో కొన్ని రోజులుగా ఈ మూడు వార్డుల్లో తాగునీటికి కటకట ఏర్పడింది. తా ము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక మహిళలు ఆందోళన చేపట్టారు. స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి బోరులో మరిన్ని పైపులు దింపి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని చె ప్పారు. రోజులు గడుస్తున్నాయి తప్ప సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

### త్వరగా పరిష్కరించాలి



గ్రామంలోని మా వార్డులోని మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. కొన్ని రోజుల కిందట నీరు రాకుంటే ఖాళీ బిందెలతో ఆందోళన చేయగా.. వెంటనే బోరులో మరిన్ని పైపులు దింపి నీరు వచ్చేలా చేస్తామని పంచాయతీ కార్యదర్శి చెప్పారు. రోజులు గడుస్తున్నాయి తప్పా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. వాడుకునేందుకూ నీళ్లు లేవు. అధికారులు స్పందించాలి. **–అనురాధ, అయినాపూర్**

# అందని నీరు.. ఎండిన పైరు

భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోరుబావుల్లో నీరు ఇంకిపోతున్నది. చేతికందే దశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. అప్పులు చేసి కొత్తగా బోర్లు వేస్తున్నా.. బోరు బావుల్లో పూడికతీత పనులు చేస్తున్నా లాభం లేకుండా పోతున్నది. కొద్ది రోజుల్లోనే చేతి కొస్తుందనుకున్న దశలో నీరు సరిపోక పంటలు ఎండుతుండడంతో అన్నదాతల ఆవేదన అంతా.. ఇంతా కాదు. అప్పులు తెచ్చి పంటలను సాగు చేశామని.. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఇది ఒక్క షాబాద్ మండలంలోనే కాదు రంగారెడ్డి జిల్లా మొత్తం ఇదే పరిస్థితి నెలకొన్నది..

-షాబాద్, మార్చి 14



కుమ్మరిగూడలో వరిపంటను పశువుల మేతకోసం కోస్తున్న రైతు లింగం

### రంగారెడ్డి జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు

- కరువు కోరల్లో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- బోరుబావుల కింద ఉన్న పంట పశువులకు మేతగా ..

యాసంగిలో బోరుబావుల కింద సాగు చేసిన పంటలు సరిపడా నీరందక ఎండిపోతున్నాయి. గత బీఆర్‌ఎస్ హయాంలో సరిపడా వానలు కురియడంతో చెరువులు నిండి అలుగులు పారి బోరుబావుల్లో నీటిమట్టం ఘననీయంగా పెరిగింది. దీనికి తోడు కేసీఆర్ అందించిన 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా, అదునుకు పెట్టుబడి సాయంతో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండే. కానీ, గతేడాది వర్షాలు సరిగ్గా కురువకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ప్రస్తుతం విద్యుత్తు కోతలు విధిస్తుండడంతో ఉన్న కొద్దిపాటి పంట కూడా నీళ్లు అందక ఎండుముఖం పడుతున్నది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట కండ్ల ముందే ఎండుతుండడంతో రైతు కంట కన్నీరు ఆగడం లేదు. షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ గ్రామంలో వరిపంట పశువులకు మేతగా మారింది. బోరు బావుల్లో నీరు తగ్గడంతో వేసిన పంట ఎండిపోతున్నది. దీంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



షాబాద్ : కుమ్మరిగూడలో నీరందక ఎండిపోయిన వరిపంట

### ఎండిపోతున్న పంటలు

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. బోరుబావుల కింద వేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయి. గత బీఆర్‌ఎస్ హయాంలో ఎలాంటి కరువులేకుండా పుష్కలంగా నీరు, కరెంట్ ఉండడంతో సంతోషంగా పంటలను సాగు చేసుకునే వారిమని..మళ్లీ పదేండ్ల తర్వాత రైతులు కరువుతో అల్లాడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నదాతలు వాపోతున్నారు. సాగునీటి కోసం రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నా ఫలితం లేకుండా పోతున్నది. ఒక్కో రైతు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఖర్చు చేసి 600 నుంచి 800అడుగుల లోతు వరకు బోర్లు వేస్తున్నా చుక్క నీరు రావడంలేదు. దీంతో చేసిన అప్పులు ఏలా తీర్చాలో తెలియక మథనపడుతున్నారు. ప్రభుత్వం ఎండిపోయిన పంటలను పరిశీలించి పరిహారం చెల్లించాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

### వరిపంటను పశువులకు మేతగా వేస్తున్నా..



యాసంగిలో ఎకరం వరి పంట సాగు చేశా. నాకున్న అర ఎకరంతోపాటు మరో అర ఎకరాన్ని కౌలుకు తీసుకున్నా. ఫిబ్రవరి వరకు బాగానే నీరు పారింది. పంట చేతికొచ్చే దశలో బోరు నీళ్లు పోయకపోవడంతో పూర్తిగా ఎండిపోయింది. పంట కోసం రూ.30 వేల వరకు ఖర్చు చేశా. ఎండిపోయిన పంటను పాడి ఆవులకు మేతగా వేస్తున్నా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**-శేఖర్, రైతు, కుమ్మరిగూడ, షాబాద్ మండలం**

### చుక్క నీరు పోయడం లేదు



నాకున్న మూడెకరాల పొలంలో నాలుగేండ్ల కిందట బోరు వేశా. ఈ ఏడాది వానకాలంలో వరితోపాటు పశువులకు గడ్డి సాగు చేశా. జనవరి చివరి వారంలో నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ఇప్పుడు చుక్కా నీరూ పోయడం లేదు. వేసిన పంట, పశుగ్రాసం ఎండిపోవడంతో పశువులకు మేతగా మారింది. ఇందుకోసం రూ.25 వేల వరకు అప్పు చేశా. అప్పు ఏలా తీర్చాలో తెలియడం లేదు.

**-కృష్ణయ్య, యువరైతు, కుమ్మరిగూడ, షాబాద్**

### అప్పులు చేసి బోర్లు వేశా..



యాసంగి మొదట్లో బోరు నుంచి పంటకు సరిపడా నీరు వచ్చింది. ఫిబ్రవరి నెలలో బోరు నుంచి నీరు రాకపోవడంతో రూ.2.50 లక్షలు అప్పు చేసి రెండు బోర్లు వేశా. ఒక్కొక్కటి 600 అడుగులకు పైగానే వేశా. ఒక్క బోరు నుంచి వచ్చే నీరు పాడి ఆవులకు తాగేందుకు, పశుగ్రాసానికి కూడా సరిపోవడంలేదు. దీంతో చేసిన అప్పులు ఏలా తీర్చాలో అర్థం కావడంలేదు. ఆరుగాలం కష్టపడి పంటలు సాగుచేసే రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

**- నర్సింహులు, రైతు, కుమ్మరిగూడ, షాబాద్**

### రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రైతులకు కరువు వచ్చింది. బోర్లు నీరు పోయకపోవడంతో వేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయి. అన్నదాతలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గత బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా 24 గంటల కరెంట్‌తోపాటు అదునుకు పెట్టుబడి సాయం అందించి కేసీఆర్ అండగా నిలిచారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందించకపోవడంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. వాటిని ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు. ప్రభుత్వం స్పందించి పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి.

**-భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు, హైతాబాద్, షాబాద్**

## గంజాయి ఐస్‌క్రీమ్.. స్వీట్లు

### నిందితుల అరెస్టు

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): హోలీ పండుగ సందర్భంగా నగరంలోని పలు చోట్ల ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు చేశారు. ఇందులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి గంజాయితో తయారు చేసిన 100 కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, 32గాంజా గోలీలు, 108 బర్ఫీ స్వీట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ధూల్‌పేట్‌కు చెందిన సత్యనారాయణ హోలీ పండుగ సందర్భంగా కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లో గంజాయి కలిపి విక్రయిస్తున్నాడు. ఎస్‌టీఎఫ్ బృందాలు లోయర్ ధూల్‌పేటలోని సత్యనారాయణ నివాసంపై దాడులు జరిపి అరెస్టు చేశాయి. మరో కేసులో గంజాయితో తయారు చేసిన మత్తు గోలీలు విక్రయిస్తున్న బల్దేవ్‌సింగ్‌ను అరెస్టు చేసి, అతడి నుంచి 32 గంజాయి గోలీలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయితో తయారు చేసిన బర్ఫీ మిఠాయిలు విక్రయిస్తున్న గంగాధర్‌ను అరెస్టు చేశారు. 108 మత్తు మిఠాయి బాక్సులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

